క్లుప్తంగా

93 శాతం పింఛన్ల పంపిణీ

పొన్నూరు: పట్టణంలోని 17 సచివాలయాల పరిధిలో శనివారం పింఛన్ల పంపిణీ చేశారు. వర్షం కురుస్తున్నా తెల్లవారుజాము నుంచే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు సచివాలయ సిబ్బంది పింఛన్లను అందజేశారు. పట్టణంలోని పలు సచివాలయాల పరిధిలో మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. పట్టణంలో మొత్తం 5888 పింఛన్లు ఉండగా, 93 శాతం పింఛన్ పంపిణీ చేసినట్లు మున్సిపల్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ గాయత్రి తెలిపారు. మండలంలో 10,089 పింఛన్లకు 80 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు మండల పరిషత్ సూపరింటెండ్ నారాయణరావు తెలిపారు.

శ్రీరామ ప్రసాద్‌కు సన్మానం



కాకుమాను: ప్రభుత్వ ఉద్యోగం కత్తిమీద సాము లాంటిదని అలాంటి ఉద్యోగంలో 33 సంవత్సరాలు పని చేసి ఎలాంటి మచ్చ లేకుండా ఉద్యోగ విరమణ చేయడం అభినందనీయమని ఎంఈఓ కేఎఫ్ కెనడీ అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తూ శనివారం శ్రీరామ ప్రసాద్ ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన శ్రీ రామ ప్రసాద్ దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 విజయ్ భాస్కర్ ఉన్నారు.

యువకుడు అదృశ్యంపై కేసు నమోదు



గుంటూరు రూరల్: యువకుడు అదృశ్యమైన ఘటనపై నల్లపాడు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. పెద్దపలకలూరు రోడ్డు రత్నగిరినగర్‌కు చెందిన పల్లపు నరసింహా అనే యువకుడు మతిస్థిమితంలేదని ఈనెల 29వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదని, బంధువులు, స్నేహితుల వద్ద విచారించిన ప్రయోజనం లేకపోవటంతో తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆచూకి తెలిసిన వారు నేరుగా నల్లపాడు పోలీస్ స్టేషన్ లోగానీ, 9701345128, 9666826295, 8688831605 సంప్రదించాలని కోరారు.

కుమ్మేసిన వాన.. జనజీవనం అస్తవ్యస్తం

- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- ఉప్పొంగిన వాగులు, నీట మునిగిన పంట పొలాలు
- పలు గ్రామాల మధ్య నిలిచిపోయిన రాకపోకలు



ప్రత్తిపాడు- గొట్టిపాడు మధ్య లోలెవల్ చప్టాపై ఉప్పొంగిన నక్కల వాగు

ప్రత్తిపాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షం కురిసింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం సాయంత్రం కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వాగులు ఉప్పొంగాయి. పొలాలు నీటమునిగాయి. చిరు వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రాత్రి వరకు వర్షం ఎడతెరపిలేకుండా కురుస్తూనే ఉంది.

■ ప్రత్తిపాడు- పెదగొట్టిపాడు మధ్యనున్న లోలెవల్ చప్టాపై నక్కల వాగు ఉప్పొంగింది. వర్షం నీరు ఉధృతంగా ప్రవహించడంతో పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం బోయపాలెం, ఉన్నవ, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండల పరిధిలోని పరిధిలోని గొట్టిపాడు ప్రత్తిపాడు, గనికపూడి, పెదనందిపాడు మండలం కొప్పర్రు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

■ అదేవిధంగా గొట్టిపాడు- గనికపూడి మధ్యనున్న లోలెవల్ చప్టాపై కొండవాగు ఉప్పొంగడంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

■ చినకోండ్రుపాడు నుంచి నడింపాలెం వెళ్లే దారిలో ఉన్న లోలెవల్ చప్టాపై రామవాగు ఉప్పొంగింది. నీటి ఉధృతి పెరగడంతో చప్టా పూర్తిగా వర్షం నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్తిపాడు సీఐ జి.శ్రీనివాసరావు, ఎస్ఐ కె.నాగేంద్ర సిబ్బందితో ఆయా చప్టాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

■ గుంటూరు పర్చూరు పాత మద్రాసు రోడ్డులో ప్రత్తిపాడు- అబ్బినేనిగుంటపాలెం మధ్య జూనియర్ కళాశాల వద్దనున్న లోలెవల్ చప్టాపై వర్షం నీరు ఉప్పొంగడంతో ప్రకాశం, గుంటూరు జిల్లాల మధ్య రాకపోకలు కొంత సేపు అంతరాయం ఏర్పడింది.

■ వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడులో వాగులు ఉప్పొంగి రోడ్లను ముంచెత్తాయి.

■ ప్రత్తిపాడు బస్టాండు జలమయమయ్యింది. బస్సులు బస్టాండు లోపలకు వెళ్లడానికి వీలులేక రోడ్డుపైనే ప్రయాణికులను ఎక్కించుకోవలసి వచ్చింది.

■ పొలాలన్నీ జలమయమయ్యాయి. ప్రత్తిపాడు, తిక్కిరెడ్డిపాలెం, కోయవారిపాలెం, ఐదవ మైలు, పుల్లడిగుంట, గొట్టిపాడు, పాతమల్లాయపాలెం, కొత్తమల్లాయపాలెం ప్రాంతాల్లో సాగు చేసిన పత్తి, మిర్చి పంట, వరి పొలాలు వర్షపు నీటిలో నానుతున్నాయి.

■ కోండ్రుపాడు కొండల నుంచి వస్తున్న వరద నీటి ఉధృతికి ప్రత్తిపాడు ఉప్పరపాలెం సమీపంలోని లోతట్టు ప్రాంతాల్లో వీధులు జలమయమయ్యాయి.

భారీ వర్షం.. రోడ్లన్నీ జలమయం

పొన్నూరు: పొన్నూరులో కుండపోతగా వర్షం కురిసింది. ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దాంతో వరదనీరు ఒక్కసారిగా రోడ్లపై నుంచి కాలువల్లోకి చేరడంతో ముందుకు ప్రవహించే పరిస్థితి లేక పొంగిపొర్లింది. పొన్నూరు పట్టణంలో ప్రధాన రహదారులు జలమయం కావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ ఏర్పాటు చేశారు. 9704739314, 8074624970 నంబరును ప్రజలు సంప్రదించాలని కోరారు. రాత్రి 9 గంటల నుంచి ఉదయం వరకు 9949840927, 9030809707 సంప్రదించాలని తహసీల్దార్ ప్రశాంతి తెలిపారు.

■ పట్టణవాసులు మున్సిపల్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ 08643-247737 నంబరును సంప్రదించాలని కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు.



జొన్నలగడ్డలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



వీరనాయకునిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలోకి చేరిన వర్షంనీరు

అప్పాపురం చానల్‌కు చేబ్రోలు వద్ద గండి



చేబ్రోలు: భారీ వర్షాలకు చేబ్రోలులోని అప్పాపురం చానల్‌కు గండి పడింది. దీని ప్రభావం వలన చానల్‌లోని నీరు పొలాల్లోకి, సమీపంలోని ఇళ్లలోనికి ప్రవేశించింది. పాతరెడ్డిపాలెం గ్రామం నుంచి లేమల్లపాడు గ్రామంలోకి వెళ్లే దారిలోని వంతెన సమీపంలో బలహీనంగా ఉన్న చానల్ కట్టల వద్ద గండి పండి నీరు ఉధృతంగా పొలాల్లోకి, దళితవాడ ప్రాంతాల్లోని ఇళ్లలోనికి నీరు చేరింది.

అప్రమత్తంగా ఉండాలి

కాకుమాను: భారీ వర్షాలతో ప్రజలు, వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వెంకటస్వామి సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పర్యటించారు. అప్పాపురం, కొండపాటూరు మధ్య ప్రధాన రహదారిలోని లో లెవల్ చప్టాను పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భారీ వర్షాల వలన లో లెవల్ చప్టాలో వర్షం ప్రవహించడం వలన ప్రజలు, వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.



ఎస్టీ కాలనీ వాసులకు నరకం

ప్రత్తిపాడు: కురుస్తున్న వర్షాలు ప్రత్తిపాడు ఎస్టీ కాలనీ వాసులకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తున్నాయి. కాలనీని వర్షం నీరు ముంచేసింది. దీంతో ఇంట్లో ఉన్న సామన్లు, దుస్తులు, బియ్యం.. వంటివి తడిచిపోవడంతో వారు బోరుమంటున్నారు. సమీపంలో నిర్మాణంలో ఉన్న సచివాలయాలో చేరారు. వీరికి తహసీల్దార్ భోజన ఏర్పాట్లు చేశారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

గుంటూరు రూరల్: నల్లపాడు గ్రామంలోని సత్తెనపల్లి, గుంటూరు ప్రధాన రహదారి నీటమునిగి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మల్లవరం గ్రామం నుంచి బండారుపల్లి వెళ్లే రైల్వే అండర్‌పాస్ పూర్తిగా నిండిపోయింది. దీంతో రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లాలుపురం గ్రామంలోని 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పూర్తిగా నీట మునిగి ప్రమాదకరంగా తయారైంది.

ఎడతెరిపి లేని వర్షంతో..

చేబ్రోలు: జనజీవనం అస్తవ్యస్తం అయింది. పంట పొలాలు నీటమునిగాయి. మండల పరిధిలోని వడ్లమూడి అన్నపూర్ణమ్మకాలనీ, గొడపాలెం, గరువుపాలెం ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోనికి వర్షపు నీరు చేరటంతో ప్రజలు ఆందోళన చెందారు. చేబ్రోలులోని 108 కార్యాలయంలోనికి వర్షపు నీరు చేరింది. దీంతో సిబ్బంది వేరే చోటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. శలపాడు రామలింగేశ్వరస్వామి దేవస్థానంలోకి వర్షపు నీరు చేరింది. మండల పరిధిలోని వీరనాయకునిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని వర్షపు నీరు చుట్టిముట్టింది. మండలంలోని శ్రీరంగపురం, వడ్లమూడి, నారాకోడూరు, సుద్దపల్లి, శేకూరు, వీరనాయకునిపాలెం, గొడవర్రు తదితర గ్రామాల్లోని వరి పంట పొలాలు సముద్రాన్ని తలపిస్తున్నాయి. చేబ్రోలు ప్రాంతంలో అప్పాపురం చానల్ పొంగి ప్రవహిస్తోంది.



పొన్నూరు పట్టణంలో జలమయమైన రోడ్డు



ప్రత్తిపాడు ఎస్టీ కాలనీలో నీటమునిగిన ఇళ్లు



నిర్మాణంలో ఉన్న సచివాలయంలో తలదాచుకుంటున్న ఎస్టీ కాలనీ వాసులు

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 20 మందికి ఉద్యోగాలు



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనపాడులోని కె.కె.ఆర్. అండ్ కె.ఎస్.ఆర్. ఇనిస్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్(కిట్స్ కళాశాల)లో శుక్రవారం విన్ వైర్ టెక్నాలజీస్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటారు. కంపెనీ హెచ్‌ఆర్ వినయ్, సీనియర్ డైరెక్టర్ రామల పర్యవేక్షణలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో వివిధ విభాగాలకు చెందిన చివరి సంవత్సరం విద్యార్థులు 600 మంది పాల్గొన్నారు. 20 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధి కల్పనాధికారి సి.హెచ్ చంద్రశేఖర్ రెడ్డి, అధ్యాపకులు ఉన్నారు.

వైభవంగా శ్రీ సీతారామస్వామి ఆలయ ప్రతిష్టా మహోత్సవం



పొన్నూరు: మండలంలోని కసుకర్రులో సీతారామస్వామి ఆలయ ప్రతిష్ఠ, అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు గోపూజతో కార్యక్రమాలను ప్రారంభించి ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి, మహాకుంభాభిషేకం అనంతరం శాంతి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వడ్లమూడి సంగమేశ్వర దీక్షితులు నిర్వహణలో గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమత్, సీతాలక్ష్మణ, గణపతి, సుబ్రహ్మణ్య, సహిత శ్రీరామచంద్రమూర్తి విగ్రహ ప్రతిష్ఠ, 12 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.